సాక్షి
పార్వతీపురం మన్యం
సోమవారం । 7 । ఏప్రిల్ । 2025



కార్మికులకు అండగా.. ఈ శ్రమ్
అసంఘటిత రంగ కార్మికుల పట్ల విజయనగరం జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యధోరణి అవలంభిస్తోంది.
- 8లో



కూటమిలో కుంపటి
అధికారంలోకి వచ్చి ఏడాది గడవక ముందే కూటమిలో అసమ్మతి రాగం కనిపిస్తోంది.
- 8లో

న్యూస్‌రీల్

10న కురుపాంలో జాబ్ మేళా

పార్వతీపురం టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి కల్పనలో భాగంగా పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ కలిగి 18 ఏళ్ల నిండి 28 ఏళ్లలోపు వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఉద్యోగమేళాలో పాల్గొనవచ్చని అన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత ఈ నెల 10వ తేదీ గురువారం ఉదయం 9గంటలకు కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు హాజరు కావాలని పిలుపు నిచ్చారు. ఈ జాబ్ మేళాలో 12 కంపెనీలకు చెందిన అధికార ప్రతినిధులు హాజరై, అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలోకి ఎంపిక చేసుకోవడం జరుగుతుందని అన్నారు. జాబ్ మేళాకు హాజరు కానున్న అభ్యర్థులు తమ వివరాలను హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నంబరుతో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఉదయం 9గంటలకు డ్రైవ్ జరుగు ప్రదేశంలో హాజరు కావాలని ఆ ప్రకటనలో కోరారు. వివరాలకు 63034 93720, 89788 78557 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేరడి సమీపంలో ఏనుగులు



నేరడి బీలో పచ్చని పంట పొలాల్లో ఏనుగులు

భామిని: మండలంలోని నేరడి బీ సమీపంలో ఏనుగులు ఆదివారం కనిపించాయి. రబీ వరితో పాటు మొక్కజొన్న, కనకాంబరాలు, కూరగాయల పంటలు ధ్వంసం చేస్తున్నాయి. ఏనుగులు పంట చేలల్లో సంచరిస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో భానుప్రసాద్ ఫస్ట్

బొబ్బిలి: నేపాల్‌కు చెందిన ఎస్‌బీకేఎఫ్ మరియు ఇందుశ్రీ సంస్థల ఆధ్వర్యంలో అక్కడి పోఖ్రాలో జరిగిన నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బొబ్బిలికి చెందిన యువకుడు భానుప్రసాద్ మొదటి స్థానానికి ఎంపికయ్యాడు. ఆదివారం రాత్రి జరిగిన బహుమతుల ప్రధానోత్సవంలో భానుప్రసాద్‌కు జాతీయ స్థాయి ప్రథమ బహుమతిని అక్కడి నిర్వాహకులు ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. భానుప్రసాద్ ఫైనల్స్ జరిగిన నేపాల్‌లో 220 కిలోల విభాగంలో తన సత్తా చాటాడు. భానుప్రసాద్‌ను పలువురు అభినందించారు.

కల్యాణం.. కమనీయం

రామతీర్థం భక్త జనసంద్రంగా మారింది.. ఆలయ ప్రాంగణంతో పాటు కల్యాణ వేదిక ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. జై శ్రీరామ్ నామస్మరణ మార్మోగింది. భక్తుల జయజయ ధ్వానాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు దశరధ పుత్రుడు శ్రీరామచంద్రస్వామి వారి పెళ్లి తంతు కొనసాగింది. సరిగ్గా 12గంటలకు అభిజిత్ లగ్నంలో స్వామివారు సీతమ్మ తల్లి మెడలో మాంగల్య ధారణ చేశారు. స్వామివారి కల్యాణాన్ని కనులారా తిలకించడానికి వచ్చిన అశేష భక్తజనులు మహాఘట్టాన్ని చూసి తరించారు.



- రామతీర్థంలో వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణం
- కనులారా వీక్షించి పులకించిన భక్త జనం
- జై శ్రీరామ్ అంటూ మార్మోగిన రామతీర్థం
- స్వామి వారిని దర్శించుకున్న ప్రజాప్రతినిధులు, ప్రముఖులు



జైశ్రీరామ్ అని నినదిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి, ప్రజాప్రతినిధులు, అధికారులకు, భక్తులు (ఇన్‌సెట్లో) తలంబ్రాల మహోత్సవం



జీలకర్ర బెల్లం చూపిస్తున్న పురోహితుడు

నెల్లిమర్ల రూరల్:

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామతీర్థంలో శ్రీరామనవమి పర్వదినాన శ్రీ సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. నవమి వేడుకలను పురస్కరించుకొని ఆలయంలో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం 3గంటలకు ఆరాధన, బాలభోగం, సేవాకాలం కార్యక్రమాలను అర్చకస్వాములు నిర్వహించారు. 6 గంటలకు యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమం చేపట్టారు. తరువాత ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి మంగళవాయిద్యాల నడుమ కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చారు. మండపంలోని మధ్యభాగంలో అమ్మవారిని, స్వామివారిని వేంచేంపుజేశారు. మండపంలో ఆశీనులైన శ్రీ సీతారాముల వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రీరామచంద్ర ప్రభువుకు ఏకాంతంగా అవతార సర్గ విన్నపం నిర్వహించారు. అనంతరం శ్రీ సీతారామ లక్ష్మణులకు అత్యంత వైభవంగా పాలు, పెరుగు, నెయ్యి, తేనె, ఫల రసాలు, సముద్ర నదీ జలాలతో అభిషేకాన్ని జరిపించారు. అర్చకస్వాములు ప్రతీ తంతుకు వేదమంత్రాన్ని పఠిస్తూ కల్యాణ ఘట్టాన్ని కొనసాగించారు. కల్యాణ మహోత్సవంలో భాగంగా స్వామివారికి 'కన్యావరణ' 'యజ్ఞోపవీతధారణం' జరిపించారు. వధూవరుల వంశ గోత్ర నామాలను ప్రవచించారు. ఆశీర్వచనం, పాదప్రక్షాళణం, పుష్పోదకస్నానం నిర్వహించి వరపూజ చేశారు. అనంతరం స్వామివార్లకు నూతన వస్త్రాలంకరణ చేశారు.

అభిజిత్ లగ్నంలో...

వేద పండితులు వేద మంత్రోచ్చారణ చేస్తూ సరిగ్గా 12గంటలకు అభిజిత్ లగ్నం సమీపించగానే జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని సీతారామస్వామి వారి శిరస్సుపై ఉంచారు. అనంతరం అర్చకస్వాములు మంత్రాలను జపిస్తూ శాస్త్రోక్తంగా సాక్షాత్తు సీతమ్మ తల్లి మంగళసూత్రాలను భక్త జనులకు చూపించి మాంగళ్యధారణ గావించారు. తరువాత తలంబ్రాల వేడుకను కనుల పండువగా నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. వేడుక జరుగుతున్నంతసేపు కల్యాణ ప్రాంగణం రామనామస్మరణతో మార్మోగింది. కల్యాణం అనంతరం స్వామివారి తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలను తీసుకొని భక్తులు తిరిగి పయనమయ్యారు. కల్యాణం జరుగుతున్నంత సేపు సుదర్శన జీవీ హయ గ్రీవాచార్యులు(నంద్యాల) వాస్తవ్యులు ప్రత్యక్ష వ్యాఖ్యాతగా స్వామివారి కల్యాణం గొప్పతనాన్ని భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత నృత్యాలు, కోలాట కార్యక్రమాలను భక్తులను విశేషంగా అలరించాయి.



స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ దంపతులు

రామస్వామిని దర్శించుకున్న ప్రముఖులు

రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు సింహాచలం దేవస్థానం నుంచి తెచ్చిన పట్టువస్త్రాలను స్వామివారికి సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ దంపతులు కల్యాణ వేడుకకు హాజరై పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు స్వామికి సమర్పించారు. మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు, ఆలయ ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, దేవదాయశాఖ మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, రాష్ట్ర సాధుసంతు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి, నాయకులు మత్స సత్యనారాయణ, సముద్రపు రామారావు, పతివాడ సత్యనారాయణ, తదితర ప్రముఖులు సీతారామ స్వామిని దర్శించుకున్నారు. ఆర్డీఓ కీర్తి, ఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పట్టు వస్త్రాలు తీసుకువెళుతున్న దేవాదాయశాఖ మాజీ మంత్రి కొట్టు సత్యన్నారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



స్వామి వారికి పూజ సామాగ్రి సమర్పిస్తున్న ఎం.ఎల్.సి. పెనుమత్స సురేష్‌బాబు



ఆలయం నుంచి బయటకు వచ్చే ఏకైక మార్గంలో రాకపోకలు

పక్క దారిలో ప్రముఖుల దర్శనాలు

- ఇబ్బందులు ఎదుర్కొన్న సామాన్య భక్తులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో సామాన్య భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాస్తవానికి సాధారణ భక్తులు ఉత్తర రాజగోపురం మీదుగా గతంలో దర్శనాలు చేసుకునేవారు. తూర్పు రాజగోపురం నుంచి ఇన్‌గేట్ ద్వారా ప్రజాప్రతినిధులు, వీఐపీలు, ఇతర ప్రముఖులు స్వామి దర్శనం చేసుకోవడం ఆనవాయితీ... అయితే ఈ ఏడాది తూర్పు రాజగోపురం వద్ద సామాన్య భక్తులను వేలాదిగా లోపలకి విడిచి పెట్టడంతో ప్రముఖులు వెళ్లాల్సిన లైన్‌లో భారీగా భక్తులు దర్శనమిచ్చారు. దీంతో స్వామి దర్శనానికి విచ్చేసే మంత్రులు, ప్రజాప్రతినిధులను పక్క దారిలో స్వామి దర్శనానికి పంపించారు. వచ్చే భక్తులు, వెళ్లే ప్రజాప్రతినిధులు ఒకే గేట్ ద్వారా రాకపోకలు సాగించడంతో సామాన్య భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒకేసారి వీఐపీలతో వచ్చే అనుచరులను నేరుగా గర్భగుడిలోకి విడిచి పెట్టడంతో స్వామి వారు కనిపించ లేదంటూ పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సంప్రదాయం ప్రకారం వెనుకమార్గంలో దర్శనాలు చేసుకోవడం శాస్త్ర విరుద్ధమైనప్పటికీ వీవీఐపీలకు సైతం అదే మార్గంలో దర్శనాలు చేయించడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

తాగునీటి సమస్య ఉండరాదు : కలెక్టర్



కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు వినిపించరాదని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం సంబంధిత అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందుకు గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలని అన్నారు. సమస్య ఉన్న చోట తక్షణమే స్పందించి, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఆరోగ్య, గ్రామీణ నీటి సరఫరా శాఖలు నీటి నాణ్యత ప్రమాణాల పరీక్షలను ఎప్పటికప్పుడు చేపట్టాలని అన్నారు. చేపట్టే నీటి నాణ్యత పరీక్షలు పక్కాగా ఉండాలని, రెండు శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వేసవి దృష్ట్యా నీటి నాణ్యత ప్రమాణాల పరీక్షలకు సంబంధించి ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో 14 రకాల పరీక్షలను చేపట్టడం జరుగుతుందని, దీనిని ప్రతీ రోజు పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఇందుకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని, అన్ని రకాల టెస్టులను చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షల విషయమై క్షేత్ర స్థాయిలో అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇందుకు ఆయా ప్రాంతాల్లో గల కార్యాలయాలు, సంస్థలు, సంఘాల సహకారం తీసుకోవాలని ఆయన చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ యూనిట్ల ఏర్పాటు వేగవంతం చేయాలి

పార్వతీపురం టౌన్: జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరయ్యే స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసే చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని, ఆ మేరకు మండల పరిషత్ అభివద్ధి అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వెంటనే పూర్తి చేసి ఆయా బ్యాంకుల సమన్వయంతో రుణ మంజూరు పూర్తి చేసి బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లాగిన్‌కు వెంటనే పంపించాలన్నారు.

20 లక్షల మొక్కల పెంపకానికి చర్యలు

- అటవీ శాఖ అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ శాంతిప్రియా పాండే

బొండపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా 2025 – 2026 సంవత్సరానికి సంబంధించి 20 లక్షల మొక్కలను వనమిత్ర కేంద్రాలతో పాటు నర్సరీల్లో పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అటవీ శాఖ అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ శాంతిప్రియా పాండే తెలిపారు. మండల కేంద్రంలోని వనమిత్ర కేంద్రాన్ని ఆదివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 33 వనమిత్ర కేంద్రాలతో పాటు నర్సరీల్లో ఈ ఏడాది 20 లక్షల వివిధ రకాలైన మొక్కలను పెంచి పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అలాగే వివిధ రకాల మొక్కలతో పాటు ప్రత్యేకంగా ఈ ఏడాది 30 వేల పనస మొక్కలను నర్సరీల్లో పెంచి పంపిణీ చేసేందుకుగాను చర్యలు చేపట్టినట్టు తెలిపారు. బొబ్బిలి వీణల తయారీ కోసం అవసరమైన పనస చెట్లు కొరత తీవ్రంగా ఉన్నట్లుగా ప్రభుత్వం దృష్టికి వీణల తయారీదారులు తీసుకువచ్చారని, ఈ నేపథ్యంలో వాటి పెంపకానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది 50 వేల పనస మొక్కలను నర్సరీల్లో పెంచి పంపిణీ చేసేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వనమిత్ర కేంద్రాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఓ కొండలరావు, ఎఫ్‌ఆర్‌ఓ సింధు, ఫారెస్టు ఆఫీసరు బి.అప్పలరాజు వనమిత్ర కేంద్రం సహాయకులు పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



వనమిత్ర కేంద్రంలో మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అడిషనల్ చీఫ్ కన్జర్వేటర్ శాంతిప్రియా పాండే

అవిశ్వాసం.. తుస్!

- పారని కూటమి పన్నాగం..
- పార్వతీపురం మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ఇచ్చిన అవిశ్వాస తీర్మానం తిరస్కరణకు గురయ్యే అవకాశం
- నేడో, రేపో ప్రకటన
- బలం లేకున్నా 'అతి'తో తొందరపడిన ఎమ్మెల్యే విజయచంద్ర
- చివరి నిమిషంలో విశ్వాసం చాటుకున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు
- జిల్లాలో కూటమికి మరోసారి భంగపాటు

☛ మొన్నటికి మొన్న.. పాలకొండ నగర పంచాయతీ పీఠంపై కన్నేసి, ఎన్నికల్లో 'బలుపు' చూపించి, అధికార మదంతో కుర్చీని తన్నుకుపోవాలనుకున్న కూటమి నేతల ఆశలపై అక్కడి కౌన్సిలర్లు నీళ్లు చల్లారు. స్వయంగా జిల్లాకు చెందిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి బరిలోకి దిగినా భంగపాటు తప్పలేదు. పాలకొండలోని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల విశ్వాసం ముందు వీరి పాచికలు పారలేదు.

☛ పార్వతీపురం పురపాలక సంఘ పరిధిలోని సేమ్ సీన్ రిపీట్ కాబోతోంది. వాపును చూసి.. మురిసిపోయి, తొందరపడి చైర్‌పర్సన్ మీద అవిశ్వాస తీర్మాన నోటీసు అందజేసిన ఎమ్మెల్యే విజయచంద్రకు ఇక్కడి కౌన్సిలర్లు గట్టి షాక్ ఇచ్చారు. అంకెల జిమ్మిక్కులతో మాయ చేద్దామనుకున్న కూటమికి వైఎస్సార్‌సీపీ నేతలు ఝలక్ ఇచ్చారు. అధికార యంత్రాంగం తలొగ్గకుంటే.. అవిశ్వాసం నోటీసు నేడో, రేపో తిరస్కరణకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

సాక్షి, పార్వతీపురం మన్యం: పార్వతీపురం పురపాలక సంఘం అధ్యక్షురాలు బోను గౌరీశ్వరిపై గత నెల 24న అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేసిన విషయం విదితమే. పురపాలక సంఘంలో అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు కౌన్సిలర్లను నయానో, భయానో తమ వైపునకు తిప్పుకొన్న కూటమి ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర.. అతి విశ్వాసంతో 18 మంది కౌన్సిలర్ల సంతకాలతో.. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి ప్రతిపాదిస్తూ సంయుక్త కలెక్టర్ శోభికకు నోటీసు అందజేశారు. ఇదే సందర్భంలో నిబంధనలపై కనీస అవగాహన లేకుండా.. కొంతమంది మాటలు నమ్మి, ఎమ్మెల్యే విజయచంద్ర తొందరపాటుకు గురయ్యారని అప్పట్లోనే రాజకీయ వర్గాల్లో చర్చ నడిచింది. ఇందుకు కారణం లేకపోలేదు. మున్సిపల్ ప్రాతినిధ్య చట్టంలోని నిబంధనల ప్రకారం అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించడానికి మొత్తం కౌన్సిలర్లలో 2/3 వంతు మంది నోటీసుపై సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన 30 మంది సభ్యులు ఉన్న పార్వతీపురం పురపాలక సంఘంలో 20 మంది విధిగా అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేయాలని చెబుతున్నారు. కూటమి నేతలు ఇవేవీ గ్రహించకుండానే 18 మంది కౌన్సిలర్లతో 'అవిశ్వాసం' నోటీసు అందజేయడం గమనార్హం.

కూటమికి భంగపాటు


కూటమి పార్టీలకు చెందిన కౌన్సిలర్లతో పాటు.. వైఎస్సార్‌సీపీ నుంచి బలవంతంగా లాక్కొన్న వారితో కలిపి మొత్తం 18 మంది అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చినట్లు చెబుతున్నారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వాలంటే ఎంతమంది కౌన్సిలర్ల సంతకాలు ఉండాలనే కనీస పరిజ్ఞానం లేకుండా కూటమి నేతలు తొందరపడ్డారని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ నోటీసు చెల్లుబాటు కాకపోవడం వల్లే సంయుక్త కలెక్టర్ తదుపరి చర్యలకు ఉపక్రమించలేదని మున్సిపల్ వర్గాల నుంచి వినిపిస్తోంది. అవిశ్వాస తీర్మానం నోటీసు సక్రమంగా ఉంటే.. ఈపాటికే ప్రతిపాదించిన కౌన్సిలర్లందరికీ నోటీసులు జారీ చేయాల్సి ఉంది. నోటీసులో సంతకాలు చేసిన కౌన్సిలర్ల సంతకాలు సరిపోల్చడం, వారి అభిప్రాయాలను తెలుసుకోవడం వంటి ప్రక్రియను అధికారులు చేపట్టాలి. నిబంధనల ప్రకారం 15 రోజుల్లోగా తతంగం చేపట్టాల్సి ఉన్నప్పటికీ.. అటువంటివేమీ జరగలేదు. ఇదే సమయంలో కూటమి నాయకుల ఎత్తులను చిత్తు చేయడంలో ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్తు అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు చాకచక్యంగా వ్యవహరించారు. దీంతో పలువురు కౌన్సిలర్లు తాము చేసిన తప్పిదాన్ని గ్రహించి తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. ఒకవైపు కౌన్సిలర్లు చేజారిపోవడం.. మరోవైపు సంతకాల ఫోర్జరీ విషయం వెలుగు చూడటం వంటి పరిణామాలతో కూటమి నేతలు తేరుకోలేకపోతున్నారు. అనుభవ రాహిత్యంతో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర చేసిన తప్పిదం వల్ల పరువు పోయే పరిస్థితులు ఎదురయ్యాయని తమ్ముళ్లు మథన పడుతున్నారు. ఈ విషయంలో చైర్‌పర్సన్ సీటు ఆశిస్తున్న ఓ జంపింగ్ బాబు ఆయనను పక్కదారి పట్టించారని గుసగుసలాడుకుంటున్నారు. తమ ఫోర్జరీ సంతకాల భాగోతం బయటకు రావడంతో.. మళ్లీ సదరు కౌన్సిలర్ల ఇంటింటికీ వెళ్లి మరలా సంతకాలను సేకరించే పనిలో ఉన్నట్లు సమాచారం. ఇందుకు అధికారులు సహకరిస్తున్నారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పలువురి సంతకాలు ఫోర్జరీ..

వాస్తవానికి నోటీసు అందజేసిన 15 రోజుల్లోగా అధికారి యంత్రాంగం దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. పలు దఫాలు నోటీసును పరిశీలించిన అధికారులు.. నిబంధనల ప్రకారం సభ్యుల బలం లేకపోవడం ఒకటైతే, ఉన్న సంతకాల్లోనూ ఫోర్జరీ ఉన్నట్లు గుర్తించారని సమాచారం. ఒక ఇండిపెండెంట్ సభ్యురాలు, మరో సభ్యుని సంతకాలను వేరే వారితో పెట్టించినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ.. నోటీసుపై అధికారి యంత్రాంగం ఇప్పటివరకూ ఎటువంటి ప్రకటనా చేయకపోవడంపై వైఎస్సార్‌సీపీ వర్గాల నుంచి విస్మయం వ్యక్తమవుతోంది. కూటమి పార్టీ నేతల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గుతున్నారా.. అన్న సందేహాలను వ్యక్తం చేస్తున్నారు.

అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికా ఆ ఇద్దరి వెన్నుపోటు?

యువత, బడుగు బలహీన వర్గాల వారు రాజకీయాల్లో సమున్నత స్థానంలో ఉండాలన్న ఉద్దేశంతో గత స్థానిక ఎన్నికల్లో టికెట్ల కేటాయింపులో ఆయా వర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రాధాన్యమిచ్చింది. ప్రధానంగా అప్పటి ఎమ్మెల్యే జోగారావు.. సీనియర్ నేతలను, ఆర్థిక బలం ఉన్న వారిని కాకుండా.. సామాన్య కార్యకర్తలకు సైతం కౌన్సిలర్ సీట్లు ఇచ్చి గెలిపించుకున్నారు. అటువంటి వారిలో కొంతమంది.. ఏరు దాటాక తెప్ప తగలబెట్టిన చందాన ఇప్పుడు వెన్నుపోటు రాజకీయాలకు తెర తీయడంపై ప్రజల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నన్నాళ్లూ పదవులు, హోదా అనుభవించి, ఇప్పుడు తమ సొంత ప్రయోజనాల కోసం కూటమి నేతలతో మిలాఖత్ కావడం విమర్శలకు తావిస్తోంది. ప్రధానంగా 24వ వార్డు కౌన్సిలర్ మంత్రి రవికుమార్, 7వ వార్డు కౌన్సిలర్ బి.ఆనంద్ మీద పలు అక్రమాలు, కబ్జా ఆరోపణలు ఉన్నాయి. 7వ వార్డుకు చెందిన ఆనంద్‌కుమార్ ఇటు కౌన్సిలర్‌గా ఉండటంతో పాటు.. అటు నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. మంత్రి రవికుమార్ సైతం పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో రాత్రి కాపలదారుగా పని చేస్తున్నారు. ఏనాడూ విధులకు హాజరు కారు సరి కదా.. రూ.వేలల్లో జీతాలు పొందుతున్నారు. దీంతో పాటు హెచ్.కారాడవలస, పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో భూకబ్జాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పార్వతీపురం శివారు ప్రాంతంలోని 279 సర్వే నంబరులో ఆక్రమించిన స్థలంలో దౌర్జన్యంగా పునాదులు కూడా వేశారని తెలుస్తోంది. ఇవే కాక, అక్రమంగా పేకాట స్థావరాలు, సారా వ్యాపారంలోనూ పాత్ర ఉన్నట్లు సమాచారం. ఈ అక్రమాలన్నిటినీ కప్పిపుచ్చుకోవడానికే కూటమి చెంత చేరారని ఆయా వార్డుల్లో ప్రజలు చర్చించుకుంటున్నారు.



అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేస్తున్న కౌన్సిలర్లు(ఫైల్)

క్లుప్తంగా

ఆటో బోల్తా..

- ఒకరి మృతి
- ఎనిమిది మందికి గాయాలు



సంఘటనా స్థలం వద్ద వివరాలు సేకరిస్తున్న ఎస్సై అమ్మన్నరావు

సీతంపేట: కుమారుడి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు వస్తూ ఓ తల్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. రాజన్నగూడకు చెందిన సవర లక్ష్మణ్ సీతంపేటలో గల అడ్వెంచర్ పార్కులో గేట్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం తన పుట్టినరోజును పార్కులో జరుపుకుంటానని చెప్పి భార్యాపిల్లలు, తల్లి, బంధువులను రమ్మని ఆహ్వానించాడు. దీంతో లక్ష్మణ్ తల్లి సవర పెద్దతిక్కమై (60), భార్యా పిల్లలు, బంధువులు ఆటోలో స్వగ్రామం నుంచి అడ్వెంచర్ పార్కుకు బయలుదేరారు. సరిగ్గా అక్కన్నగూడ వద్దకు వచ్చే సరికి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పెద్ద తిక్కమై అక్కడికక్కడే మృతి చెందగా.. సవర ఉషారాణి, స్మిత్, రాషి, సునేమి, రాయమన్స్, సవర సౌజన్య, సవర లీనా, సవర సోహెల్ గాయపడ్డారు. వెంటనే వీరిని స్థానిక సీహెచ్‌సీకి తరలించగా.. ముగ్గురిని శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. తన పుట్టిన రోజునే తల్లి మృతి చెందడం.. కుటుంబ సభ్యులు గాయపడడంతో లక్ష్మణ్ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. ఎస్సై వై. అమ్మన్నరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని బీజే పాలెం గ్రామానికి చెందిన కడుకట్ల అప్పన్న (60) గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. శనివారం రాత్రి 10:30 గంటల సమయంలో బహిర్భూమి కోసం గ్రామ సమీపంలోని చెరువుకు వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై బి. లోకేశ్వరరావు తెలిపారు.

చికిత్సపొందుతూ ఒకరు..



రాజేష్ (ఫైల్)

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని కుందరతిరువాడ పంచాయతీ నీచుకవలస గ్రామానికి చెందిన పత్తిక రాజేష్ (24)విశాఖపట్నం గాజువాకలో నూతన గృహానికి పెయింటింగ్‌లు వేసేందుకు వెళ్లి అక్కడ గత నెల 28న విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే స్థానికులు కేజీహెచ్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. కుటుంబాన్ని పోషిస్తున్న కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు శ్రీనివాసరావు, సునీత, తమ్ముడు రాకేష్ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ప్రమాదవశాత్తూ మరొకరు..

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌పై ప్రమాదవశాత్తూ ప్రసాద్ (55) అనే వ్యక్తి మృతి చెందాడని జీఆర్‌పీ హెచ్‌సీ మధుసూదనరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రాజాం మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన ప్రసాద్ విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో పని చేస్తున్నారు. మూడు రోజుల కిందట తన స్వగ్రామమైన బొద్దాం వచ్చిన ఆయన తిరిగి విజయవాడకు వెళ్లేందుకు చీపురుపల్లి రైల్వేస్టేషన్‌కు శనివారం రాత్రి చేరుకున్నాడు. అయితే ప్రసాద్ రైలు నుంచి జారి పడి మరణించాడా.. లేక మరే ఇతర కారణాల వల్ల మరణించాడో అన్న విషయం తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

కార్మికులకు అండగా.. ఈ శ్రమ్

- పథకంపై అవగాహన అంతంతమాత్రమే
- జిల్లాలో అసంఘటిత రంగ కార్మికులు సుమారు 7 లక్షల మంది
- పథకంలో నమోదైన వారు 4,19,542 మంది
- అవగాహన కల్పించని అధికారులు



ఈ - శ్రమ్ కార్డులు



గ్రిగ్ కార్మికులకు ఈ-శ్రమ్ నమోదు చేస్తున్న కార్మిక శాఖ కమిషనర్, సిబ్బంది

విజయనగరం గంటస్తంభం: అసంఘటితరంగ కార్మికుల పట్ల విజయనగరం జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యధోరణి అవలంభిస్తోంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకాన్ని అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బహుళ ప్రయోజనాలు కలిగిన ఈ పథకం గురించి తెలిసిన వారే నమోదు చేసుకుంటున్నారు తప్ప తెలియని వారి గురించి ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా విజయనగరం జిల్లాలో సుమారు 7 లక్షల మంది వరకు అసంఘటిత రంగ కార్మికులుండగా.. ఇంతవరకు 4,19,542 మంది మాత్రమే ఈ పథకంలో నమోదు చేసుకున్నారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇంకా 2 లక్షల మంది పైచిలుకు నమోదు చేసుకోవాల్సి ఉంది.

కొరవడిన అవగాహన..

అధికారులు అవగాహన కల్పించకపోవడంతో ఈ పథకం గురించి ఎవ్వరికీ పెద్దగా తెలియడం లేదు. ప్రారంభంలో అధికారుల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, కార్మిక సంఘాల నేతల సూచనలతో నమోదు చేసుకునేందుకు కార్మికులు పోటీపడ్డారు. ఇప్పుడు ఎక్కడా ఆ ఊసే లేదు. అసంఘటిత రంగ కార్మికులు, వలస కార్మికులు, చిరు వ్యాపారులకు భరోసా కల్పించేందుకు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ ఈ - శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించింది. ఇందులో నమోదైన వారికి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుంది. పైగా ఎన్నో సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతాయి. ఈ పోర్టల్‌ను ప్రారంభించి ఏడాది గడిచినా.. నేటికీ చాలా మంది దరఖాస్తు చేసుకోకపోవడంతో సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు.

చేకూరే ప్రయోజనాలివి..

ఈ -శ్రమ్‌లో నమోదైతే 12 అంకెలు కలిగిన యూఏఎన్ కార్డులు అందజేస్తారు. ఈ కార్డులు ఉన్నవారికే అన్ని రకాల సామాజిక భద్రత పథకాలు, సంక్షేమ పథకాలను వర్తింపజేస్తారు. ఇందులో నమోదు చేసుకున్న ప్రతి కార్మికుడికీ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తూ అంగవైకల్యం చెందితే రూ. లక్ష బీమా పరిహారం అందజేస్తారు. అలాగే ఇతర సంక్షేమ పథకాల్లో కూడా వీరికి ప్రాధాన్యం ఇస్తారు. వలస కార్మికులు ఎక్కడ ఉన్నారో గుర్తించి ఉపాధి మార్గాలు చూపిస్తారు. 60 ఏళ్లు దాటిన వారికి నెలకు రూ.3 వేల పెన్షన్ ఇస్తారు.

అర్హులు వీరే..

- వయసు 16 నుంచి 59 సంవత్సరాల మధ్యలో ఉండాలి.
- ఆదాయపు పన్ను పరిధిలోకి రాకూడదు.
- ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్ఓ), ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ) సదుపాయం లేని వారు.
- ఉద్యానవనాలు, నర్సరీలు, పాడి పరిశ్రమ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, అనుబంధ రంగాల కార్మికులు, టైలర్లు, డ్రైవర్లు, హెల్పర్లు, వీధి వ్యాపారులు, కల్లుగీత, రిక్షా కార్మికులు, చెత్త ఏరేవారు, కొరియర్ బాయ్‌లు, ఇళ్ల పనివారు, ఉపాధి వేతనదారులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, మధ్యాహ్న భోజనం వర్కర్లు, లోడింగ్/అన్‌లోడింగ్ కార్మికులు, తదితరులందరూ ఈ పథకానికి అర్హులు.

పథకంలో నమోదుకు కావాల్సిన పత్రాలు..

- ✔ సేవింగ్ బ్యాంక్ ఖాతా
- ✔ బ్యాంక్ ఖాతా ఐఎఫ్ఎస్‌సీ కోడ్
- ✔ రేషన్ కార్డు
- ✔ ఆదాయ ధృవీకరణ పత్రం
- ✔ ఆధార్ కార్డ్
- ✔ యాక్టివ్ మొబైల్ నంబర్ ఆధార్ కార్డుతో లింక్
- ✔ నివాస ధృవీకరణ పత్రం
- ✔ పాస్‌పోర్టు సైజ్ ఫొటో
- ✔ వయస్సు రుజువు పత్రం



జిల్లా కార్మిక శాఖ కార్యాలయం



ఆన్‌లైన్‌లో ఈ-శ్రమ్ కార్డుకు నమోదు చేసుకుంటున్న అసంఘటితరంగ కార్మికులు

అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం



ఈ-శ్రమ్ పథకంపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు ఆరుగురికి ప్రమాద బీమా పరిహారం రూ. 2 లక్షల చొప్పున అందజేశాం. ఒక ఇంటిలో ఎంతమంది ఉన్నా ఈ పథకానికి అర్హులే.

– ఎస్‌డీవీ ప్రసాదరావు, కార్మిక శాఖ ఉప కమిషనర్, విజయనగరం జిల్లా

ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తుకెళ్లిపోతున్నారు..



దేశపాత్రునిపాలెంలో ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌ను దొంగలించి అక్కడే పడేసిన డొక్కులు

కొత్తవలస: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ఎత్తుకెళ్లిపోతున్నారు. దేశపాత్రునిపాలెం గ్రామ సమీపంలోని ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం రాత్రి ఎత్తుకెళ్లిపోయారు. గడిచిన రెండు నెలల వ్యవధిలో మండలంలోని పలు గ్రామాలలో ఏడు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయని ఏఈ అప్పారావు తెలిపారు. కంటకాపల్లి జగనన్న కాలనీలో -2, కాటకాపల్లి జగనన్న కాలనీలో -1, పెదరావుపల్లిలో -2, దాట్ల లే అవుట్‌లో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తుకెళ్లిపోయారని చెప్పారు. సింగిల్ ఫేజ్ (16 కేవీ సామర్థ్యం) ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్ సరఫరా ఉన్నప్పుడే దొంగలు చాకచక్యంగా కిందకు దించి అందులో గల కాపర్‌ను తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్ డొక్కులను అక్కడే వదిలేసి వెళ్లిపోతున్నారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ విలువ రూ. 2 లక్షలకు పైనే ఉంటుంది. దేశపాత్రునిపాలెంలో జరిగిన దొంగతనంపై గ్రామానికి చెందిన శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సైబర్ మోసగాడు అరెస్ట్ ?

- అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు
- నిందితుడు ఇంజినీరింగ్ విద్యార్థిగా గుర్తింపు



ఈనెల 2న సాక్షిలో వచ్చిన కథనం

వీరఘట్టం: హాలో .. నేను వీరఘట్టం పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ చేస్తున్నాను.. ఎస్సై గారు ఆస్పత్రిలో ఉన్నారు.. అర్జెంట్‌గా రూ.55 వేలు ఫోన్ పే ద్వారా కావాలని నమ్మబలికి 75693 41175 నంబర్ నుంచి ఫోన్ చేసి వీరఘట్టంనకు చెందిన ప్రతాప్ అనే వ్యక్తి నుంచి నిందితుడు రూ.28 వేలు కాజేశాడు. ఈ వ్యవహారంపై ఈనెల 2న సాక్షిలో 'కానిస్టేబుల్‌నని చెప్పి సైబర్ మోసం' శీర్షికన ప్రచురితమైన కథనంపై వీరఘట్టం పోలీసులు స్పీడ్‌గా స్పందించారు. ఎస్పీ ఆదేశాల మేరకు బాధితుడికి వచ్చిన 75693 41175 ఫోన్ నంబర్ ఆధారంగా సైబర్ నేరగాడి ఆచూకీ గుర్తించారు. ఫోన్ నంబర్‌ను ట్రాక్ చేయగా నిందితుడు కృష్ణా జిల్లా బాపట్లలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వీరఘట్టం పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ ఐదు రోజుల కిందట బాపట్లకు పయనమయ్యారు. ఎస్సై జి. కళాధర్ వీరఘట్టం నుంచి నిందితుడి ఫోన్‌ను ట్రాక్ చేస్తూ హెచ్‌సీ, కానిస్టేబుళ్లకు దిశానిర్దేశం చేశారు. దీంతో బాపట్లలో నిందితుడ్ని పోలీసులు ఆదివారం చాకచక్యంగా పట్టుకున్నారు. సైబర్ నేరానికి పాల్పడిన వ్యక్తి బీటెక్ చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థిగా గుర్తించారు. ఈ సైబర్ నేరం వెనుక ఉన్న కుట్రదారులందరినీ పట్టుకునే ప్రయత్నంలో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు నిర్వహిస్తున్నారు. నిందితుడ్ని సోమవారానికి వీరఘట్టంనకు తీసుకువస్తారని సమాచారం.

వాట్సాప్ గ్రూప్‌పై అనుమానాలెన్నో....

'వి.జి.టి.యం నీడ్ మనీ ట్రాన్స్‌ఫర్స్ వీరఘట్టం' అనే వాట్సాప్ గ్రూప్‌లో ఈ సైబర్ నేరానికి బీజం పడడంతో పోలీసులు ఈ గ్రూప్ అడ్మిన్‌తో పాటు పెద్ద ఎత్తున మనీ ట్రాన్స్‌ఫర్స్ చేస్తున్న వారిపై నిఘా వేశారు. ఈ గ్రూప్‌లో ఎవరికైనా డబ్బులు కావాలన్నా, ఫోన్ పే కావాలన్నా గ్రూప్‌లో ఉండే సభ్యులు గతంలో పెట్టిన మెసేజ్‌లు.. ఇంత వరకు జరిగిన అన్ని మనీ ట్రాన్స్‌ఫర్స్‌పై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. సైబర్ నేరగాడు నోరు విప్పితే అసలు దొంగలు ఎవరనేది తేలుతుంది.

కూటమిలో కుంపటి



పల్లా శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న కోండ్రు వర్గీయులు (ఫైల్)

- జనసేనకు ఏఎంసీ చైర్మన్ పదవి
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు వర్గం

రాజాం: అధికారంలోకి వచ్చి ఏడాది గడవకముందే కూటమిలో అసమ్మతిరాగం కనిపిస్తోంది. రాజాం నియోజకవర్గంలో ఓ వైపు టీడీపీలో అంతర్గత పోరు నెలకొనగా.. మరోవైపు కూటమిలో భాగస్వామి అయిన జనసేనను కూడా టీడీపీకి చెందిన ఓ వర్గం వ్యతిరేకిస్తోంది. ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఏఎంసీ నామినేటెడ్ పదవిపై టీడీపీ కార్యకర్తలు అసమ్మతి రాగం వినిపిస్తున్నారు. ప్రధానంగా రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు చెందిన వర్గం జనసేన పార్టీకి ఏఎంసీ ఇవ్వడాన్ని తప్పుపడుతోంది. పదవి ప్రకటించిన రోజే రాజాంలోని టీడీపీ కార్యాలయంలో అత్యవసరంగా సమావేశమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయంపై అసమ్మతి వినిపించారు. అక్కడితో ఆగకుండా ఈ నెల 5న విశాఖపట్నంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి పొగిరి కృష్ణవేణికి ఏఎంసీ ఎలా ఇస్తారంటూ ప్రశ్నించారు. వెంటనే ఏఎంసీ చైర్మన్ గిరీని రద్దు చేసి ఎమ్మెల్యే కోండ్రు సూచించిన వ్యక్తికి ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

ఆది నుంచే అసమ్మతి..

రాజాం నియోజకవర్గంలో 2019 సార్వత్రిక ఎన్నికల ముందు నుంచే టీడీపీలో వర్గపోరు ప్రారంభమైంది. అప్పట్లో కావలి ప్రతిభాభారతికి టిక్కెట్ ఇవ్వొద్దంటూ టీడీపీకి చెందిన ఓ వర్గం నిరసన తెలిపి కోండ్రు మురళీమోహన్‌ను తెరపైకి తీసుకువచ్చారు. 2019 ఎన్నికల్లో కోండ్రు మురళీమోహన్ ఓటమి చెందగా.. కావలి ప్రతిభాభారతి కుమార్తె గ్రీష్మ తెరపైకి వచ్చి పార్టీ కార్యక్రమాలు నిర్వహించింది. మళ్లీ 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓ వైపు కోండ్రు వర్గం, మరో వైపు గ్రీష్మ వర్గం టికెట్ కోసం ప్రయత్నించగా.. ఊహించని విధంగా కోండ్రు టికెట్ సంపాదించి గెలుపొందారు. అనంతరం ఆయన సోదరుడు జగదీష్ షాడో ఎమ్మెల్యేగా అవతరించడంతో.. ఈ తంతు నచ్చని టీడీపీకి చెందిన మరోవర్గం పలుచోట్ల అసమ్మతి రాగం వినిపిస్తూనే పైకి సమాచారాన్ని చేరవేసింది. దీంతో అనూహ్యంగా కావలి గ్రీష్మ ఎమ్మెల్సీగా మళ్లీ తెరపైకి వచ్చింది. ఇప్పుడు ఎవరూ ఊహించని విధంగా జనసేన పార్టీకి చెందిన కృష్ణవేణికి ఏఎంసీ పదవి రావడంతో కోండ్రు వర్గం జీర్ణించుకోలేకపోతుంది. మొదటి నుంచీ తాము అనుకునేది జరగాలనే వైఖరితో ఉన్న కోండ్రు వర్గానికి ఈ వ్యవహారం నచ్చడంలేదు. దీంతో జనసేనకి ఏఎంసీ రద్దుచేసి తమకే ఇవ్వాలంటూ పట్టుబడుతున్నారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఎమ్మెల్యే ప్రమేయం ఉందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

దాడి కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, వెనుక ముసుగులో నిందితుడు

విజయనగరం క్రైమ్: రెండు రోజుల కిందట యువతిపై దాడి చేసిన నిందితుడిని ఆదివారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడ్ని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గరివిడి మండలం శివరాం గ్రామంలో ఉంటున్న బాధిత యువతికి తన అన్న ద్వారా నిందితుడు గర్ల ఆదినారాయణతో పరిచయం ఉంది. నిందితుడు తరచూ బాధిత యువతి ఇంటికి వస్తుంటాడు. ఇదిలా ఉంటే బాధిత యువతి చెల్లెలు విజయవాడలో ఉంటోంది. నిందితుడు ఫోన్ ద్వారా ఆమెతో కూడా పరిచయం పెంచుకున్నాడు. కొద్ది రోజులుగా నిందితుడు ఆదినారాయణ ఫోన్‌లో బాధితురాలి చెల్లిని అసభ్య పదజాలంతో వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని ఆమె శివరాంలో ఉంటున్న సోదరికి చెప్పుకుంది. దీంతో బాధితురాలు తన చెల్లిని ఎందుకు వేధిస్తున్నావని ఆదినారాయణను నిలదీసింది. అలాగే చుట్టుపక్కల వాళ్లకు కూడా చెప్పడంతో ఆదినారాయణ బాధిత యువతితో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఈ నెల 5వ తేదీన ఇంటిలో వంటపాత్రలు శుభ్రం చేస్తున్న బాధిత యువతిపై నిందితుడు కత్తితో దాడి చేసి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు నిందితుడ్ని పట్టుకునేందుకు ఐదు బృందాలను రంగంలోకి దించింది. గంటల వ్యవధిలో నిందితుడు పట్టుబడడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడ్ని త్వరగా పట్టుకున్న నేపథ్యంలో చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు, గరివిడి ఎస్సై లోకేశ్వరరావులను ఎస్పీ అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య..

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కొండపాలేం గ్రామంలో కె.బాలరాజు (32) అనే వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు... బాలరాజు తన భార్య పద్మతో కలిసి శ్రీకాకుళం జిల్లా పలాసలో చెప్పులు కుట్టుకుని జీవనం సాగిస్తుండేవాడు. బాలరాజుకు మద్యం అలవాటు ఉండడంతో నిత్యం భార్యతో గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో పలాస నుంచి కొండపాలెంలో ఉన్న తల్లి యశోద వద్దకు ఇటీవల వచ్చేశాడు. ఆదివారం ఉదయం తల్లితో గొడవపడి ఇంటికి సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై బి.లోకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రావెల్ తవ్వకాలపై దాడి

బొబ్బిలి రూరల్: దిబ్బగుడ్డివలస చెరువులో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా చేపడుతున్న గ్రావెల్ తవ్వకాలపై రెవెన్యూ అధికారులు ఆదివారం దాడి చేశారు. ఆర్ఐ కొల్లి రామకుమార్ ఆధ్వర్యంలో వీఆర్ఓలు ఈశ్వరరావు దాడి చేసి జేసీబీ, రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. వాహనాలను మైనింగ్ శాఖాధికారులకు అప్పగిస్తామని ఆర్ఐ రామకుమార్ తెలిపారు.

పోలీసుల సాక్షిగా రాములోరి కల్యాణం

- పెనసాంలో భారీగా మోహరించిన పోలీసులు
- ఉత్కంఠ పరిస్థితుల్లో శ్రీరామ నవమి వేడుకలు



రామ మందిరం సమీపంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



పోలీస్ సిబ్బంది నడుమ కల్యాణం జరిపిస్తున్న గ్రామపెద్దలు

గంట్యాడ: మండలంలోని పెనసాంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా సీతారాముల కల్యాణం జరిగింది. పోలీసుల సాక్షిగా సీతారాములు మరోసారి ఒక్కటయ్యారు. అసలు కల్యాణం జరుగుతుందో.. లేదోననే ఉత్కంఠ శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు నెలకొంది. వివరాల్లోకి వెళితే.. పెనసాం గ్రామంలో 25 ఏళ్లుగా లెంక నారాయణప్పడు కుటుంబీకులు శ్రీరామ నవమి రోజున కల్యాణం జరిపిస్తూ వస్తున్నారు. అయితే ఈ ఏడాది కూటమి పార్టీకి చెందిన కొంతమంది ఎప్పుడూ ఒకే కుటుంబీకులు కల్యాణం జరిపించాలా... మార్చాలంటూ పట్టుబట్టారు. ఈ క్రమంలో 15 రోజుల కిందట పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో గంట్యాడ పోలీస్ స్టేషన్, విజయనగరం ఆర్డీఓ కార్యాలయంలో పలుమార్లు చర్చలు జరిగాయి. ఏళ్ల తరబడి తమ కుటుంబ సభ్యులే సీతారాముని కల్యాణం జరిపిస్తున్నామని లెంక నారాయణప్పడు కుటుంబీకులు పోలీసులు, అధికారులకు చెప్పారు. అప్పట్లో గ్రామ పెద్దలు, మండల ప్రజాప్రతినిధుల సమక్షంలో లెంక నారాయణప్పడు కుటుంబీకులే కల్యాణం జరిపించాలంటూ చేసిన తీర్మానాలను సైతం అధికారులకు చూపించారు. అయినప్పటికీ కూటమి నేతలు అంగీకరించలేదు. విజయనగరం డీఎస్పీ పెనసాం గ్రామ పెద్దలు, మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ, కూటమి కి చెందిన నేతలతో శనివారం రాత్రి కూడా చర్చలు జరిపారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఎట్టకేలకు లెంక నారాయణప్పడు కుటుంబీకుల్లో ఒకరు, కూటమికి చెందిన ఒకరు కల్యాణం జరిపించడానికి అంగీకరించారు. ఇరువర్గాలు అంగీకరించినప్పటికీ, శాంతిభద్రతలకు విఘాతం కలగకూడదనే ఉద్దేశంతో గ్రామంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నలుగురు సీఐలు, ఐదుగురు ఎస్సైలు, 120 మంది వరకు ఇతర సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా 144వ సెక్షన్ విధించారు. అన్ని గ్రామాల్లో ప్రశాంతంగా సీతారాముల కల్యాణం జరిగితే.. పెనసాంలో పోలీసుల పహారాలో కల్యాణం జరగడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కల్యాణంలో జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహామూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, సర్పంచ్ కర్రోతు పాపాయ్యమ్మ , ఎంపీటీసీ సభ్యుడు లెంక మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.